# పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా..



కలెక్టరేట్ ఎదుట ప్రచారం నిర్వహిస్తున్న సాంస్కృతిక సారథి కళాబృందం

- ఓటు హక్కుపై విస్తృత ప్రచారం
- కళాబృందాలచే ప్రదర్శనలు

కలెక్టరేట్, అక్టోబర్ 30 : రాబోయే సాధారణ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈవీఎంల ద్వారా ఓటు వినియోగించు కోవడం, ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి వ్యక్తి తమ ఓటును సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఉద్యోగులు, ఇతర కార్పొరేట్ సంస్థల్లో విధులు నిర్వహించే వారు కూడా నిర్లక్ష్యం వహించకుండా ఆయా కార్యాలయాల ఎదుట ప్రదర్శనలు నిర్వహిస్తూ, అవగాహన పెంచుతోంది. ఇందులో భాగంగా సోమవారం సాంస్కృతిక సారథి కళాబృందాలచే కలెక్టరేట్‌లోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్, పలు సంస్థల ఎదుట ఓటు హక్కు వినియోగంపై ప్రచారం చేపట్టింది. ప్రాథమిక హక్కుగా భావిస్తూ ఓటు వేసేందుకు తగిన సమయం కేటాయించాలని సూచిస్తూ, స్వీప్ నోడల్ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లాలో అనేక మంది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ బాధ్యతలు కొనసాగిస్తున్న సిబ్బంది ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే అపవాదు నెలకొంది. కొంతమంది ఎన్నికల విధులు నిర్వహించే వారైతే, మరికొంత మంది ఉద్యోగరీత్యా పోలింగ్ రోజున ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, పోలింగ్ రోజున ప్రకటించే సెలవును వినియోగించుకునే క్రమంలో ఓటు వేయకుండానే ఇతర ప్రాంతాలకు వెళ్లడం లాంటి తెంపరితనం ప్రదర్శిస్తుంటారు. వీరి నిర్లక్ష్యం ఇతరులకు సోకుతూ, వారు కూడా ఇదేతీరున వ్యవహరిస్తుండడం షరా మామూలుగా మారింది. ఈక్రమంలో వీరిని సోమరితనం నుంచి బయటకు తెచ్చి, ఓటును సద్వినియోగం చేసుకునేలా చైతన్య గీతాలు ఆలపిస్తూ, వారిలో నిద్రాణమైన ప్రాథమిక బాధ్యతను తట్టిలేపుతున్నారు. త్వరలో ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు స్వీప్ నోడల్ అధికారి రవీందర్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సాంస్కృతిక సారథి కళాకారులు వడ్లకొండ అనిల్‌కుమార్, దుర్గం మురళి, పొల్లాల వాణి, దొగ్గల రాజు, శ్రీధర్, ఆవునూరి కోమల, తిరుపతి, ఎర్ర సురేష్, గొల్లపల్లి శ్రీకాంత్, ఆసియా, సోనీ పటేల్, సాయికుమార్, రాధ, సంధ్య, అర్చన, పద్మ, ఉదయ పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు ..అండగా ఉంటాం

బాధిత కుటుంబాలకు మంత్రి గంగుల భరోసా


నాగులమల్యాలలో కట్ల శ్రావణ్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి

కొత్తపల్లి, అక్టోబర్ 30 : ఎవరూ అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని మంత్రి గంగుల కమలాకర్ పలువురు బాధితులకు భరోసా కల్పించారు. సోమవారం మండలంలో పలు బాధిత కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. నాగులమల్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కట్ల శ్రావణ్ (25) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కమాన్‌పూర్ ఉప సర్పంచ్ మణి తండ్రి రామయ్య మరణించగా మంత్రి పరామర్శించారు. ఇక్కడ కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## బీఆర్ఎస్ డోర్ టూ డోర్ సర్వే

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 30: మండలంలోని చెర్లభూత్కూర్, దుర్శేడ్, చామనపల్లి, నగునూర్ లో బీఆర్ఎస్ నాయకులు ఓటర్ లిస్టుపై డోర్‌టుడోర్ సర్వే నిర్వహించారు. గ్రామంలోని కుటుంబ సభ్యుల వివరాలు, సెల్ నంబర్లు, కమ్యూనిటీ తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. చెర్లభూత్కూర్ గ్రామంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, మాసగోని రమేశ్, మధు, కూర శ్యాంసుందర్ రెడ్డి, దుర్శేడ్‌లో ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, గ్రామాధ్యక్షుడు రామోజ్ తిరుపతి, రాజ్‌కమల్, భూతం రవీందర్ పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే హత్యాయత్నం

కలెక్టరేట్, అక్టోబర్ 30 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభంజనంతో తమ ఓటమి తప్పదనే భయంతోనే కొంత మంది అధికార పార్టీ అభ్యర్థులపై హత్యాయత్నానికి తెగిస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆరోపించారు. సోమవారం నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా తొమ్మిదేళ్లుగా పాటుపడుతూ, పార్లమెంటు సభ్యుడిగా ప్రజలకు సేవలందిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దుబ్బాకలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైన నేపథ్యంలో నిరాశ,నిస్పృహల్లో ఉన్న ఇతర పార్టీల అభ్యర్థులు తమ అనుచరులతో భౌతికదాడులకు తెగించడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల కమిషన్ స్పందించి నిందితుల వెనుక ఉన్న హస్తాలెవరివో ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 30 : నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు జరిగాయి. ఇందులో భాగంగా భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అవరణలోని సుబ్రహ్మణ్యస్వామికి అభిషేక అర్చనలు, విశేషాలంకరణ చేశారు. పార్థివ లింగాలకు భక్తులతో అభిషేకాలు చేయించారు. పాతబజార్ గౌరీశంకరాలయం, చైతన్యపురి మహాశక్తి ఆలయం, కమాన్ రోడ్ రామేశ్వరాలయం, బొమ్మకల్ రోడ్డు రాహు కేతు సహిత సంతానప్రద నాగేంద్రస్వామి ఆలయంతో పాటు సుబ్రహ్మణ్య, నాగేంద్రస్వామి విగ్రహాలున్న ఆలయాల్లో పూజలు జరిగాయి.

## బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 30 : నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయ 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సేనాధిపతి ఉత్సవంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంతరం అంకురార్పణ, మృత్సంగ్రహణం, ధ్వజపట శయనాధివాసములు కనుల పండువలా నిర్వహించారు. సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణం, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఎదుర్కోలు, హిరణ్యాక్ష సంహారలీల, రాత్రి శేషవాహనసేవ తదితర పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి


యువకులకు బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేవేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ అల్గునూర్ యువకులు పేర్కొన్నారు. సోమవారం నగరంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్సీ కాలనీకి చెందిన సిరిసిల్ల అనోహర్, లంక ప్రశాంత్, లంక సంపత్, కన్నం రాజు, మొదుంపెల్లి తిరుపతి, సిరిసిల్ల చందు, లంక అన్వేష్, లంక అక్షయ్ కుమార్, సిరిసిల్ల అన్వేష్, తాటిపెల్లి గౌతమ్, ఎలుక పెల్లి సంపత్, సిరిసిల్ల పరశురాములు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారదారవీందర్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సల్ల మహేందర్, చిందం కిష్టయ్య, రామచంద్రారెడ్డి, అశోక్‌రెడ్డి, సిరిసిల్ల అంజయ్య, జాప రవీందర్‌రెడ్డి, లంక రవి, ముంజ సంపత్, దాసం కమలాకర్, పరశురాములు, పడాల రమేశ్, తాటికొండ రవి, పల్లె ప్రశాంత్, దిలీప్, దీపక్, మైనార్టీ నాయకులు అఫ్రోజ్, ఫయాజ్, అజార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌పై ఉప్పొంగిన అభిమానం


స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా...ఉద్యమమే లక్ష్యంగా పోరాడి సీమాంధ్రుల బానిస సంకెళ్ల నుంచి తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛావాయువులు అందించి, రాష్ట్రాన్ని స్వర్ణమయంగా మార్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అంటే గ్రామీణ ప్రాంతాల్లో యువత, మధ్యతరగతి ప్రజలకు ఎనలేని అభిమానం ఉంది. దీనిని ఒక్కొక్కరు ఒక్కో రకంగా చూపుతుంటారు. చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన బుర్ర సోమ తన కుడి చేతిపై కేసీ ఆర్ బావ అని పచ్చబొట్టు వేయించుకున్నాడు. అలాగే, తన ఫోన్ కవర్‌పై సీఎం కేసీఆర్ చిత్రాన్ని వేయించి, వినియోగిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. సోమవారం నగరంలోని కోర్టు సమీపంలో గల ఓ హోటల్‌లో ఫోన్ కాల్ మాట్లాడుతుండగా, నమస్తే తెలంగాణ క్లిక్ మనిపించింది. దీనిపై సోమును ఆరా తీయగా సీఎం కేసీఆర్‌కు తాను వీరాభిమానిగా చెప్పుకున్నాడు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగుతున్నట్లు చెప్పాడు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం పేరు నిరంతరం గుర్తుకు వచ్చేలా తన చేతిపై పచ్చబొట్టు వేయించుకున్నట్లు తెలిపారు.


ఫోన్ కవర్‌పై సీఎం కేసీఆర్ చిత్రం, చేతిపై కేసీఆర్ పేరును పచ్చబొట్టు వేయించుకున్న బుర్ర సోమ

## రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థులు


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడా పాఠశాల విద్యార్థులు

కొత్తపల్లి, అక్టోబర్ 30 : సిద్దిపేటలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ ఒకటి వరకు జరుగనున్న 67వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ యోగా పోటీలకు క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడాశాఖాధికారి కీర్తి రాజువీర్ తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న క్రీడా పాఠశాల విద్యార్థులు విగ్నేష్, అభినయ్, లక్ష్మీప్రసన్న, భావన అత్యంత ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారన్నారు. రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ కరాటే పోటీలకు విద్యావాలి పాఠశాల విద్యార్థి మణిదీప్ ఎంపికైనట్లు చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ ఆర్ పృథ్వీరావు పేర్కొన్నారు. ఇటీవల గోదావరిఖనిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న మణిదీప్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.



రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యావాలి విద్యార్థి